
సాక్షి
గుంటూరు
శనివారం । 23 । మార్చి । 2024



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జేసీ

మంగళగిరి: ఆత్మకూరు నిర్మల కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను శుక్రవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ రాజకుమారి పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహరి (ఆది)
గుంటూరు	6.24	4.53
నరసరావుపేట	6.26	4.55
బాపట్ల	6.24	4.53

న్యూస్‌రీల్

డీపీఓలో పోలీస్ సంక్షేమ దివస్



నగరంపాలెం: పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శుక్రవారం 'పోలీస్ సంక్షేమ దివస్' (గ్రీవెన్స్ డే) నిర్వహించారు. జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లు, వివిధ విభాగాలలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది, ఏఆర్, హోంగార్డులు హాజరై, వారి సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎస్పీ వినతి పత్రాలను స్వీకరించి వాటిని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

జీజీహెచ్‌ను సందర్శించిన మలేషియా వైద్య బృందం



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌ని మలేషియా వైద్య బృందం సభ్యులు శుక్రవారం సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మలేషియా దేశానికి చెందిన గెస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ అల్లన్ మాథ్యూస్, ఫార్మాస్యూటికల్ డైరెక్టర్ డాక్టర్ మహబూబ్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మలేషియా దేశానికి చెందిన గేస్ట్ యూనివర్సిటీకి చెందిన వైద్యులు చలపతి ఫార్మాస్యూటికల్‌తో ఎంఓయూ కుదుర్చుకునేందుకు వచ్చారని, అందులో భాగంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని సందర్శించారని చెప్పారు. కార్యక్రమంలో చలపతి ఫార్మాస్యూటికల్ డాక్టర్ ఎస్.వి.రామారావు ఉన్నారు.

యార్డులో 91,650 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 82,280 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 91,650 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 19,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 22,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 71,990 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై భక్తజన సందడి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తజన సందడి ఎక్కువగా కనిపించింది. అమ్మవారి ప్రధాన ఆలయంలో జరిగిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం రెండో అంతస్తులో శుక్రవారం పెద్ద ఎత్తున వివాహాలు జరిగాయి. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో రామారావు క్యూలైన్లను పరిశీలించారు.

నేడు సికింద్రాబాద్-సత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): హోలీ పండుగ వేళ రద్దీ దృష్ట్యా వయా విజయవాడ మీదుగా సికింద్రాబాద్-సత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్‌వో నుస్రత్ మండ్రుప్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-సత్రాగచ్చి ప్రత్యేక రైలు (07645) శనివారం రాత్రి 9.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు అర్ధరాత్రి 12.15 గంటలకు సత్రాగచ్చి చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07646) 25 ఉదయం 5.45 గంటలకు సత్రాగచ్చిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.10 గంటలకు సికింద్రాబాద్ చేరుతుందని తెలిపారు.

ఆలపాటి రాజీడ్రామా

- బాబు బుజ్జగింపుతో దిగివచ్చిన రాజా
- ప్రత్యేక పరిస్థితి వల్ల సర్దుకుపోవాలంటూ కార్యకర్తలకు హితవు
- రాజకీయాలు ఎలా ఉంటాయో అర్థం అయ్యాయి...
- తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ట్వీట్
- బాపట్ల ఆశలపై కత్తితో పొడిచారంటూ సింబాలిక్‌గా చెప్పిన శ్రీదేవి



సాక్షి ప్రతినిధి, గుంటూరు: మాజీ మంత్రి ఆలపాటి రాజా మరోసారి రాజీనామా డ్రామా ఆడారు. తనకు సీటు లేదని తేలిపోవడంతో మరోసారి హైడ్రామాకు తెరలేపారు. తొలుత తన ఇంట్లో ముఖ్యనేతలతో సమావేశమైన ఆయన టికెట్ ఇవ్వకపోతే పార్టీకి రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారంటూ లీకులు ఇచ్చారు. సాయంత్రం నాలుగు గంటలకు తెనాలిలో ఆత్మీయ సమావేశం అన్నారు. మళ్లీ దాన్ని రాత్రి ఏడు గంటలకు మార్చారు. ఈలోగా చంద్రబాబునాయుడి నుంచి కబురు వచ్చింది. రాజా తాడేపల్లి వెళ్లి చంద్రబాబునాయుడిని కలిశారు. ఆయన టికెట్ ఎందుకు ఇవ్వలేకపోయారో వివరించారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పడంతో తెనాలి వచ్చిన ఆలపాటి రాజా కొన్ని ప్రత్యేక పరిస్థితుల వల్ల సర్దుకుపోవాలంటూ కార్యకర్తలకు హితవు పలికారు.

మూడో జాబితాపై మండిపాటు

శుక్రవారం చంద్రబాబునాయుడు విడుదల చేసిన మూడో జాబితాపై పలువురు తెలుగుదేశం నేతలు మండిపడుతున్నారు. సీటు ఇస్తామని చెప్పి చివరి నిముషంలో చంద్రబాబు మోసం చేయడంతో మాజీ మంత్రి ఆలపాటి రాజా మరోసారి హైడ్రామా నడిపారు. ఇంతకుముందు నాదెండ్ల మనోహర్‌కు టికెట్ ప్రకటించినప్పుడు కూడా ఇదే ధోరణి ప్రదర్శించారు. అనంతరం గుంటూరు పశ్చిమ, పెనమలూరు సీట్ల కోసం ప్రయత్నించారు. గుంటూరు పశ్చిమ గల్లా మాధవికి కేటాయించారు. దింపుడు కళ్లం ఆశగా పెనమలూరు ప్రయత్నించారు. దీనికి నాదెండ్ల మనోహర్ కూడా సహకారం అందించారు. దీంతో పెనమలూరు సీటు దాదాపుగా తనకే ఖరారు అయ్యిందన్న ప్రచారం సాగింది. చివరి నిముషంలో బోడె ప్రసాద్‌కే ఈ సీటును చంద్రబాబు ఖరారు చేయడంతో ఆలపాటి రాజా వర్గం తెనాలిలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో మరోసారి అధిష్టానాన్ని కలుస్తానని, అందరూ అండగా ఉంటానంటే ఒక నిర్ణయం తీసుకుందామంటూ చెప్పి వారిని పంపించేశారు.

ఉండవల్లికి నిరాశే..

బాపట్ల పార్లమెంట్ టికెట్ వస్తుందని ఆశగా ఎదురుచూసిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఆ సీటును మాజీ ఐపీఎస్ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు కేటాయించడంతో నిరాశ చెందారు. రాజకీయాలు ఎలా ఉంటాయో ఈ రోజే తెలిసిందంటూ ట్వీట్ చేసింది. బాపట్లను ట్యాగ్ చేస్తూ పక్కన వెన్నుపోటును సూచించేలా కత్తితో సింబల్ పెట్టి ట్వీట్ చేశారు. తెలుగుదేశంలో చేరిన సమయంలో తాడికొండ సీటు కుదరకపోతే తిరువూరు అసెంబ్లీ, బాపట్ల ఎంపీ స్థానాలకు తన పేరు పరిశీలించాలని కోరిన శ్రీదేవి. అయితే ఈ సీట్లన్నింటిలో వేరే వారిని ప్రకటించడంతో ఖంగుతిన్న శ్రీదేవి ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.

రెండు రోజుల్లో మళ్లీ అధిష్టానాన్ని కలుస్తా..

ఆలపాటి రాజా

తెనాలి: రెండు, మూడు రోజుల్లో అధిష్టానాన్ని మళ్లీ కలుస్తాను. ఆ తర్వాత నిర్ణయం తీసుకుందామని మాజీ మంత్రి ఆలపాటి రాజా తెలిపారు. శుక్రవారం రాత్రి తెనాలిలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈలోగా చంద్రబాబునాయుడు పిలిచి బుజ్జగించడంతో ఆయన తన మనసు మార్చుకున్నారు. రాత్రి తొమ్మిదిన్నర తర్వాత తెనాలి వచ్చిన ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. తాను కార్యకర్తగా వచ్చానని, శాసనసభ్యునిగా, మంత్రిగా ఓడిపోయినా మీలో ఒక్కడిగా ఉన్నానన్నారు. ఇప్పుడు ప్రత్యేక పరిస్థితి ఉందని, పార్టీ అనేది ఒక చెట్టులాంటిది. ఆ చెట్టునీడన అందరూ బతకాలన్నారు. ప్రజల్లో నుంచి వచ్చి ప్రజల్లో బతకాలనుకుంటున్న తనకు ఈ పరిస్థితి కష్టంగానే ఉందన్నారు. ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఆగుతున్నానని చెప్పారు. పార్టీ టికెట్ నిరాకరించిన ప్రతిసారీ మూకుమ్మడి రాజీనామాల పేరుతో టీవీల్లో స్క్రోలింగ్‌లు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం అంటూ హడావుడి చేయటం ఆలపాటికి అలవాటుగా మారిందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను పోగేయటం, ఈలోగా అధిష్టానంతో మంతనాలు, ఆగ్రహావేశాలతో రగిలిపోతున్న అందరినీ బుజ్జగించటం పట్ల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తెనాలిలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశంలో తేల్చేయటమేనంటూ ప్రచారం చేశారు. ఐటీడీపీ సోషల్ మీడియాలోనూ ఇదే తరహా పోస్టింగులు వెల్లువెత్తాయి. తర్వాత మీటింగ్ రాత్రి ఏడు గంటలకంటూ షేర్ చేశారు. తీరా చూస్తే ఆలపాటి రాజా, మంగళగిరిలో పార్టీ నేతలతో ఉన్నట్టు సమాచారం. ఇదిగో వస్తున్నాడంటూ కార్యకర్తలు పడిగాపులు కాచారు. చివరకు రాత్రి 9.45 గంటలకు ఆత్మీయ సమావేశం వేదిక నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ కళా సదనంకు వచ్చిన ఆలపాటి రాజా, మళ్లీ పాత పాతాన్నే అప్పగించారు. కార్యకర్తల మనోభావాలపై నీళ్లు చల్లారు.

బీసీలకు దేశం ఝలక్ !

- నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థిగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన లావు శ్రీకృష్ణదేవరాయులు ఎంపిక
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా బీసీ నేత డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఇప్పటికే ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- టీడీపీ కూడా బీసీ నేతకు టికెట్ కేటాయించాలని ఒత్తిడి తెచ్చిన బీసీ సంఘాలు
- చివరకు అగ్రవర్ణ పెత్తందారులకే మద్దతు తెలిపిన చంద్రబాబు
- నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా చదలవాడ అరవింద్‌బాబు పేరు ఖరారు
- అరవింద్‌బాబు అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన లావు శ్రీకృష్ణదేవరాయులు
- అసెంబ్లీ సీటు కేటాయిస్తామని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న యాదవ సామాజిక వర్గం

సాక్షి, నరసరావుపేట: దశాబ్దాలుగా బీసీల పార్టీ అని చెప్పుకుంటూ వారిని కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్న టీడీపీ మరోసారి బడుగు, బలహీన వర్గాలకు వెన్నుపోటు పొడిచింది. బీసీ జనాభా అధికంగా ఉన్న నరసరావుపేటలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అగ్రవర్ణ కులాల వారే ఎంపీలుగా గెలుపొందుతున్నారు. అయితే బీసీలకు రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పరంపరను మార్చేందుకు ఈ దఫా వైఎస్సార్ సీపీ తరఫున నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌ను పోటీలో నిలిపారు. ఈ మంచి ఆలోచనను ప్రశంసించిన బీసీ సంఘాలు టీడీపీ సైతం బీసీ అభ్యర్థిని పోటీలో ఉంచాలని కోరాయి. అయితే పెత్తందారుల ప్రతినిధిగా పేరు పొందిన చంద్రబాబు నాయుడు వారి డిమాండ్‌ను పక్కనపెట్టి కమ్మ సామాజిక వర్గానికి చెందిన లావు శ్రీకృష్ణదేవరాయులును ఎంపీ అభ్యర్థిగా శుక్రవారం ప్రకటించారు. దీనిపై బీసీలు తీవ్రంగా మండిపడుతున్నారు. సీట్ల కేటాయింపులో బీసీలకు చంద్రబాబు తీవ్ర అన్యాయం చేశారని, ఈ ఎన్నికల్లో ఓటుతో బాబుకు బుద్ధి చెబుతామంటున్నారు.

లావు వ్యతిరేకించినా చదలవాడకే ..

పల్నాడు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నరసరావుపేట అసెంబ్లీ సీటును ఎట్టకేలకు చదలవాడ అరవింద్‌బాబుకు శుక్రవారం టీడీపీ అధిష్టానం కేటాయించింది. ఈ సీటు కోసం పోటీ పడిన కడియాల, నల్లపాటి వర్గాలు ఈ నిర్ణయంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. గత ఎన్నికల్లో 30 వేలకుపైగా ఓట్ల తేడాతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై ఓడిన వ్యక్తిని మళ్లీ బరిలోకి దింపడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పేట టికెట్ హామీతోనే టీడీపీలోకి వెళ్తున్నాను అంటూ ప్రచారం చేసుకున్న వైఎస్సార్ సీపీ బహిష్కృత నేత అట్ల చినవెంకటరెడ్డికి చంద్రబాబు మొండిచేయి చూపారు. చదలవాడ అరవింద్‌కు టికెట్ ఇవ్వడానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నారు. తను పోటీలో ఉంటే సరైన పోటీ ఇవ్వలేమని, ఒకటి రెండు పేర్లు సూచించారు. ముఖ్యంగా కమ్మ సామాజిక వర్గానికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే లావు తీరుకు వ్యతిరేకంగా రెండు రోజుల కిందట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లావు, చదలవాడ వర్గాల మధ్య వైరం మరింత పెరిగింది. పురుగుమందు తాగిన వెంకటరామిరెడ్డిని ఎంపీ లావు కనీసం పరామర్శించలేదని, మా ఓట్లు మీకు అవసరం లేదా అని చదలవాడ వర్గీయులు ప్రశ్నిస్తున్నారు.

యాదవ వర్గానికి మొండిచేయి...

నరసరావుపేట అసెంబ్లీ నుంచి యాదవ సామాజిక వర్గ నేతను పోటీలో ఉంచుతామని టీడీపీ నేతలు ప్రచారం చేశారు. ఆ స్థానం నుంచి జంగా కృష్ణమూర్తిని బరిలో దింపాలని లావు శ్రీకృష్ణ ప్రయత్నించారు. మరో ఎన్ఆర్ఐ నేత పేరును పరిశీలించారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఒక నేతకు టికెట్ ఇవ్వాలని ఆ వర్గం డిమాండ్ చేసింది. అయితే శుక్రవారం ప్రకటించిన జాబితాలో యాదవ నేత పేరు లేకపోవడంతో ఆ వర్గం తీవ్ర నిరాశకు లోనైంది. గురజాల, నరసరావుపేటలలో ఏదో ఒక చోట టికెట్ ఇస్తామని ఆశ చూపి చివరకు మొండిచేయి చూపారని, రానున్న ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

కాపులకు మొండిచేయి

- చీరాల టికెట్ కోసం పట్టుబట్టిన జనసేన నేత ఆమంచి స్వాములు
- బీజేపీ కోటాలో బాపట్ల సీటు అడిగిన అన్నం సతీష్ ప్రభాకర్
- పదేళ్లుగా ఉమ్మడి ప్రకాశం కాపు సంఘం అధ్యక్షుడిగా ఉన్న స్వాములు
- ఇద్దరు కాపు నేతలకు టికెట్ ఇవ్వని పార్టీలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీలు కాపు సామాజికవర్గాన్ని పూచిక పుల్లలా చూస్తున్నాయా? వారికి ఎటువంటి రాజకీయ ప్రాధాన్యం లేకుండా చేస్తున్నాయా? అంటే ప్రస్తుత పరిణామాలు వాటికి బలం చేకూరుస్తున్నాయి. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీలు ఉన్నాయి. ఇందులో వేమూరు, సంతనూతలపాడు నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుకు కేటాయించగా, మిగిలిన ఐదు నియోజకవర్గాలు జనరల్ కేటగిరిలో ఉన్నాయి. ఇందులో కూటమి పార్టీలు అద్దంకి, పర్చూరు టిక్కెట్లు సామాజిక వర్గానికి కట్టబెట్టాయి. చీరాల సీటు యాదవ సామాజిక వర్గానికి ఇవ్వగా, బాపట్ల క్షత్రియులకు, రేపల్లె గౌడ సామాజిక వర్గానికి కేటాయించారు. కాపు సామాజిక వర్గానికి బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం గమనార్హం. దీంతో కాపు సామాజికవర్గం కూటమి పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

బాపట్లలో 'అన్నం'కు ఎసరు

బాపట్ల, చీరాల ప్రాంతాల్లో బలమైన కాపు సామాజికవర్గం నేతలు ఉన్నా టీడీపీ, జనసేన, బీజేపీలు ఆ నేతలకు టికెట్లు ఇచ్చేందుకు నిరాకరించడం చర్చనీయాంశంగా మారింది. బాపట్ల నియోజకవర్గంలో దాదాపు 15 వేల కాపు ఓట్లు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి చెందిన అన్నం సతీష్ ప్రభాకర్ కీలక నేత. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బాపట్ల నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందిన సతీష్‌కు టీడీపీ ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది. ఆ తర్వాత నారా లోకేష్‌కు, సతీష్‌కు మధ్య విభేదాలు పొడచూపడంతో సతీష్ టీడీపీని వీడి బీజేపీలో చేరారు. తాజాగా జరగనున్న ఎన్నికల్లో బీజేపీ కోటాలో బాపట్ల టికెట్ కోసం శాయశక్తులా ప్రయత్నించారు. బాపట్ల సీటు బీజేపీకి ఇచ్చేందుకు టీడీపీ నిరాకరించడంతో సతీష్‌కు సీటు దక్కలేదు. దీంతో సతీష్‌తోపాటు ఆయన అనుచరులు, సామాజికవర్గం టీడీపీపై తీవ్ర ఆగ్రహంతో ఉంది.

పొత్తులో స్వాములు చిత్తు

చీరాలకు చెందిన జనసేన నేత ఆమంచి స్వాములు పదేళ్లగా ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లాల కాపు సంఘం నేతగా ఉన్నారు. ఆయన ఆరునెలల కిందట ఆర్భాటంగా జనసేన పార్టీలో చేరారు. చీరాల టికెట్ తనదేనని ప్రకటించుకున్నారు. ఆ తర్వాత కాదు కాదు దర్శి సీటు అన్నారు. కొద్ది రోజులకు గిద్దలూరు అన్నారు. కానీ చివరకు చీరాల టికెట్ కూడా ఆయనకు దక్కలేదు. పొత్తు చీరాల సీటు ఇచ్చేందుకు చంద్రబాబు ససేమిరా అన్నారు. టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న ఎంఎం కొండయ్యకు చీరాల టికెట్ ఖరారు చేశారు. దీంతో చీరాల సీటు విషయంలో జనసేన వెనక్కి తగ్గింది. తనకు టికెట్ దక్కక పోవడంతో మనస్తాపం చెందిన ఆమంచి స్వాములు ఆ పార్టీ చీరాల సమన్వయకర్త పదవికి రాజీనామా చేశారు. చీరాల నియోజకవర్గంలో ఎనిమిది వేల వరకూ కాపు సామాజిక వర్గం ఓట్లు ఉన్నాయి. జనసేన నేతకు టికెట్ లభించకపోవడంతో నామమాత్రంగా ఉన్న కాపు ఓట్లు సైతం టీడీపీ అభ్యర్థికి వేసే పరిస్థితి లేకుండా పోయింది. ఇద్దరు కాపు నేతలు అటు జనసేన ఇటు బీజేపీ లనుంచి టికెట్ల ఆశించి భంగపడ్డారు. జిల్లాలో కూటమిలోని మిగిలిన రెండు పార్టీలకు ఒక్కసీటు కూడా కేటాయించలేదు.

నారసింహుని హంస వాహనోత్సవం





స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్లో) హంసవాహనంపై గ్రామోత్సవంలో దర్శనమిస్తున్న శ్రీవారు

మంగళగిరి: పట్టణంలో వేంచేసివున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు శుక్రవారం ఉదయం హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి గజవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వగా అశేషసంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ముగ్ధులయ్యారు. ఉత్సవాలను ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించగా హంసవాహన సేవ కైంకర్యపరులుగా వేదాంత గోపాల సత్యవతి, వేణుగోపాల వాసుదేవ భట్టర్, అరుణ ప్రియలు గజవాహన సేవ కైంకర్యపరులుగా పాతమంగళగిరి శ్రీ పద్మశాలీయ సంఘం వారు వ్యవహరించారు. రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు సాంస్కృతిక కళావేదికలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, కూచిపూడి నృత్య ప్రదర్శన, బుర్రకథలు అలరించాయి.

నేడు పొన్నవాహన ఉత్సవం


బ్రహ్మోత్సవాలల్లో భాగంగా ముఖ్య ఉత్సవమైన స్వామి వారి శనివారం ఉదయం కల్పవృక్షవాహనం, రాత్రి పొన్నవాహన మహోత్సవం జరుగుతుందని ఈఓ ఏ రామకోటిరెడ్డి తెలిపారు. భక్తులు ఉత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన

నాదెండ్ల: మహిళల పట్ల కొందరు ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించటంతో చోటుచేసుకున్న ఘర్షణలో ఓ యువకుడి గొంతుకోసిన సంఘటన నాదెండ్లలో గురువారంరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని అమరయ్య మఠం ఆరాధనోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి అన్నదానం నిర్వహించారు. గ్రామంలోని అన్ని వర్గాల వారు భోజనం చేసి తిరిగి వెళ్తున్నారు. రాత్రి 9 గంటల సమయంలో కొందరు మహిళలు వెళ్తుండగా అదే కాలనీకి చెందిన కొందరు ఆకతాయిలు ద్విచక్రవాహనాలపై వెళ్తూ వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. విషయాన్ని మహిళలు స్థానికులకు తెలిపారు. కొందరు యువకులు ఆకతాయిలను ప్రశ్నించారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సర్దిచెప్పి పంపారు. పోలీస్‌స్టేషన్ నుంచి తిరిగి వెళ్తున్న షేక్ అల్లాబక్షుని కొరివి సన్ని చాకుతో గొంతు కోశాడు. అల్లాబక్షును చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం బాధితుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

నిబంధనలు అతిక్రమించిన టీడీపీ నేతలు

- ఎన్నికల కంట్రోల్ టీమ్ ఆదేశాలు పట్టించుకోని నేతలు
- పెమ్మసాని, మాధవి, పలువురు నేతలపై కేసు నమోదు



గుంటూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థులు

గుంటూరు ఈస్ట్ : ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి టీడీపీ నాయకులు శుక్రవారం అమరావతి రోడ్డులో ఊరేగింపు నిర్వహించారు. సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయినా పట్టించుకోలేదు. ఇది తెలిసిన ఎన్నికల కంట్రోల్ టీమ్ టీడీపీ నాయకులను కలిసి అనుమతి లేకుండా ప్రచారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంతటితో ఆగిపోవాలని కోరారు. టీడీపీ నేతలు వారిని లెక్క చేయకుండా వేళంగిణి నగర్ వెళ్లి అనుమతులు లేకుండా సభ నిర్వహించారు. సుమారు 1500 మందికి భోజనాలు పెట్టారు. ఎన్నికల కంట్రోల్ టీమ్ అరండల్‌పేట పోలీసులకు ఈ విషయంపై సమాచారం అందించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి టీడీపీ గుంటూరు జిల్లా పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గల్లా (పిడుగురాళ్ల) మాధవి, నాయకులు కోవెలమూడి రవీంద్ర, మద్దిరాల నాని, కరపత్రి శ్రీను, కసుకుర్తి హనుమంతరావు, కన్నెగంటి బాలకృష్ణ, కె.పేరయ్య, దారపనేని నరేంద్ర, పోపూరి నరేంద్ర, ఉప్పల రామారావు, సుఖవాసి శ్రీనివాసరావు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, నిమ్మల శేషయ్య, బ్రహ్మంలపై కేసు నమోదు చేశారు. 143, 341, 290, 188, 171హెచ్, 171ఈ, ఆర్/డబ్ల్యూ, 149 ఐపీసీ సెక్షన్‌ల ప్రకారం కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఏ పార్టీ అయినా అనుమతులు లేకుండా ప్రచారం చేసినా, ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాలు నిర్వహించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని సూచించారు. ఎన్నికల సమయంలో కేసు నమోదు అయితే సమస్యలు ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు.

పెదకూరపాడులో టీడీపీకి భారీ షాక్

- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత
- పార్టీలో పెరుగుతున్న అంతర్గత విభేదాలు
- అయోమయంలో భాష్యం ప్రవీణ్



టీడీపీ గ్రామ అధ్యక్షుడు సురేష్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: పెదకూరపాడులో టీడీపీని ఒక్కొక్కరు వీడుతున్నారు. నిన్న అమరావతిలోని ముస్లింలు... నేడు పెదకూరపాడులో టీడీపీకి పట్టు ఉన్న సామాజిక వర్గానికి చెందిన నేత ఆ పార్టీని వీడారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను కాదని, పక్క నియోజకవర్గానికి చెందిన భాష్యం ప్రవీణ్‌కు టికెట్ కేటాయించడంతో ఆ పార్టీలో అంతర్గత విబేధాలు బహిర్గతమవుతున్నాయి. పార్టీకి అండదండగా ఉన్న నేతలే పార్టీ వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. మరో వైపు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ నుంచి సహకారం లేకపోవడంతో ప్రవీణ్ ఆందోళనకు గురవుతున్నారు.

నంబూరు విజయానికి కృషి చేస్తా...

తెలుగుదేశం పార్టీకి పట్టు ఉన్నట్లు భావిస్తున్న పెదకూరపాడులో పెద్ద షాక్ తగిలింది. టీడీపీలో కీలకనేతగా ఉండి పార్టీ కష్టకాలంలో అండగా ఉన్న ప్రవాసభారతీయుడు, పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే గ్రామ టీడీపీ అధ్యక్షుడు వెల్లలచెరువు సురేష్ ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వెల్లలచెరువు సురేష్‌కు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆహ్వానించారు. సురేష్ మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, కనీస గౌరవం దక్కలేదని వాపోయారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమం, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మా ప్రాంత రైతుల అభివృద్ధి కోసం ఎత్తిపోతల పథకం తీసుకొచ్చేందుకు చేస్తున్న కృషి నచ్చిందన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. మళ్లీ ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావును గెలిపించేందుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు.

ఆ పార్టీలో కనీసం గౌరవం లేదు

టీడీపీలో కార్యకర్తలకు కనీస గౌరవం లేదని అందుకే వైఎస్సార్ సీపీలో భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఇచ్చి ఆదరిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలన్నారు.

–నంబూరు శంకరరావు, ఎమ్మెల్యే

క్లుప్తంగా

రూ.95,600 నగదు స్వాధీనం

తాడికొండ: వాహన తనిఖీలలో భాగంగా తాడికొండ అడ్డరోడ్డులో రూ.95,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. గుంటూరు నుంచి ఇన్నోవా కారులో అమరావతి వైపు ఫంక్షన్‌కు వెళుతున్న సింగారెడ్డి ఆదిలక్ష్మీ అనే మహిళ వద్ద నగదు గుర్తించిన పోలీసులు రసీదులు చూపించాలని అడగ్గా చూపించలేక పోవడంతో సీజ్ చేసి ఐటీ అధికారులకు పంపించారు. గుంటూరులోని ఓ ప్రైవేటు పాఠశాలకు సంబంధించిన ఉద్యోగిగా పనిచేస్తున్న ఆమె బిల్లుల రూపంలో వచ్చిన నగదును తనవద్ద పెట్టుకున్నానని చెప్పగా సంబంధిత రసీదులు చూపించి తీసుకెళ్లాలని అధికారులు ఆదేశించారు.

కొర్రపాడు చెక్‌పోస్టులో...

మేడికొండూరు: మండల పరిధిలోని కొర్రపాడు చెక్‌పోస్టు వద్ద అనధికారికంగా తరలిస్తున్న రూ.2,93,700 నగదు మేడికొండూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



సీఐ జయకుమార్ కథనం ప్రకారం గుంటూరు విద్యానగర్‌కు చెందిన నెలకుర్తి మురళీ శుక్రవారం పల్నాడు జిల్లా రాజుపాలెంకు కారులో వెళుతున్నాడు. మేడికొండూరు పరిధిలోని కొర్రపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. మురళీ కారులో నగదు ఉండటంతో పోలీసులు ప్రశ్నించగా, సరైన సమాధానం చెప్పకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జయకుమార్ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై సదాశివరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు కేంద్రంగా చిల్లీస్ బోర్డు తీసుకువస్తా

వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య



మిర్చియార్డులో పర్యటిస్తున్న కిలారి రోశయ్య, పక్కన వైఎస్సార్ సీపీ నేతలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు కేంద్రంగా చిల్లీస్ బోర్డు తీసుకు రావడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా గుంటూరు తూర్పు, ప్రత్తిపాడు నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులు షేక్ నూరి ఫాతిమా, బాలసాని కిరణ్‌కుమార్, యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణలతో కలిసి శుక్రవారం ఆయన యార్డులో పర్యటించారు. ప్రతి మిర్చి కమిషన్ షాపు యాజమాన్యం, ప్రతినిధులు, వివిధ ముఠా కార్మికులు, అసోసియేషన్ నేతలను కలుసుకొని ఆప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి సహకరించాలని కోరారు. అనంతరం వేమెన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ మిర్చి యార్డు అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానన్నారు. గతంలో తాను స్పైసెస్ బోర్డు మెంబరుగా ఉన్న సమయంలో లేబోరేటరీని తీసుకురావడం జరిగిందని తెలిపారు.

నూరి ఫాతిమా మాట్లాడుతూ మిర్చి యార్డుకు సంబంధించి ఏ సమస్య ఉన్నా పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రత్తిపాడు అభ్యర్థి బాలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోశయ్య వంటి వారు పార్లమెంట్‌లో అడుగుపెడితే మిర్చి యార్డు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మిర్చి దిగుమతి వ్యాపారుల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు లేళ్ళ పెద్ద అప్పిరెడ్డి మాట్లాడుతూ ట్రేడ్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ముఠా కార్మిక సంఘం నాయకుడు కేమార్క్ శ్రీనివాస రెడ్డి, వేమెన్స్, నాయకులు పాల్గొన్నారు.

27న ఈపీఎఫ్ కార్యాలయంలో నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగ స్వామ్య యజమానులందరు కార్యక్రమానికి విధి గా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదే విధంగా నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు.

గుంటూరు కృష్ణనగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి, విజయవాడ కానూరులోని నారాయణ జూనియర్ కళాశాల, ప్రకాశం జిల్లా వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని నిమ్రా ఇంజినీరింగ్ కళాశాల, రేపల్లెలోని మున్సిపల్ కార్యాలయం, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రగతి పబ్లిక్ స్కూల్లో జరిగే కార్యక్రమాల్లో ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రొయ్యల చెరువులో విష ప్రయోగం

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం నుంచి కొత్తలూరు వెళ్లే రహదారి వెంబడి ఉన్న రొయ్యల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయటం వలన రూ.7 లక్షల విలువైన రొయ్యల మృతి చెందినట్లు బాధితుడు రామచంద్రయ్య తెలిపారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విషంతో కూడిన ప్లాస్టిక్ కవరు ద్వారా రహదారి వెంబడి ఉన్న రొయ్యల చెరువులోకి విసిరివేసి వెళ్లారు. దీంతో చెరువులోని రొయ్యలన్నీ మృత్యువాత పడ్డాయి. విషయాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ చల్లా సురేష్, కేసు నమోదు చేసి సెంటరులో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిశీలించారు.

26లోపు ఓటర్ల క్లయిమ్స్‌ను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: ఓటరు దరఖాస్తుకు సంబంధించి వచ్చిన అర్జీలను సక్రమంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వర్చువల్‌గా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఫారం-7, 8 దరఖాస్తులు పెండింగ్ లేకుండా ఈనెల 26లోపు పరిష్కరించాలన్నారు. నూతన ఓటర్ల నమోదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఫారం-6 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ప్రతి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కనీసం ఒక కెమెరాతో స్టాటిక్ సర్వేలెన్స్ టీం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం 33 సేవలకు సంబంధించిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు. సదరు ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వలంటీర్లు గానీ, సచివాలయ సిబ్బంది గానీ, కాంట్రాక్టు ఉద్యోగులు కానీ, ప్రభుత్వ ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ పార్టీలు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణ విషయంలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా సంఘటనలు జరిగితే వాటికి సంబంధించిన వాస్తవ వివరాలను ఎన్నికల సంఘానికి తెలియజేసేందుకు నివేదికను వెంటనే రిటర్నింగ్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రతిరోజూ తొమ్మిది నివేదికలను భారత్ ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, ఆ నివేదికలు పంపే క్రమంలో అలసత్వం వహించకూడదని కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీ, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్, డీఆర్వో పెద్ది రోజా, అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఇన్విజిలేటర్ల జంబ్లింగ్

పల్నాడు డీఈఓ వెంకటేశ్వర్లు



నరసరావుపేట ఈస్ట్: జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పాటిస్తూ జిల్లాలోని 127 పరీక్ష కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లకు జంబ్లింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఆయా కేంద్రాలలో ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులను మరో పాఠశాలలో ఇన్విజిలేటర్లుగా నియమించినట్టు చెప్పారు. వీరితో పాటు సిట్టింగ్ స్క్వాడ్‌లను కూడా జంబ్లింగ్ చేసినట్టు వివరించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను సందర్శించి ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పరిశీలిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయటంతోపాటు వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా త్రాగునీటి వసతి కల్పిస్తూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. పరీక్షల్లో భాగంగా నిన్నటి వరకు లాంగ్వేజ్ పేపర్ల పరీక్షలు జరగగా, శుక్రవారం నుంచి ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు మొదలయ్యాయి. శుక్రవారం నిర్వహించిన గణితం పరీక్షకు పల్నాడు జిల్లా పరిధిలో 27,627 మంది విద్యార్థులకు గాను 26,624 మంది హాజరయ్యారు.

గ్రామీణులకు మానసిక ధైర్యం కల్పించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ రవి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి

నరసరావుపేట: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీఎంఓ)లు గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, రోగులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సూచనలు, సలహాలు అందజేసి వారిలో మానసిక ధైర్యం నింపాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శుక్రవారం ఆరో వార్డు బాబాపేట పీహెచ్‌సీలో నూర హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సీఎంఓలకు నిర్వహించిన కేర్ కంపానియన్ ప్రోగ్రామ్ జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రామ్‌లో సీఎంవోలు కీలక బాధ్యతలు నిర్వహించాల్సి ఉందని చెప్పారు. శిక్షణలో కోటప్పకొండ, చాగల్లు పీహెచ్‌సీల పరిధిలోని అల్లూరివారిపాలెం, దొండపాడు, చినతురకపాలెం, యడవల్లి, గోనెపూడి, గురవాయపాలెం, ఇక్కుర్తి, జొన్నలగడ్డ, కాకాని, లింగంగుంట్ల ఒకటి, రెండు, పాలపాడు, పమిడిమర్రు, పెట్లూరివారిపాలెం, పోతవరం, రావిపాడు, రావిపాడు-2, ఉప్పలపాడు, చాగల్లు, చేజర్ల గ్రామాలకు చెందిన సీఎంఓలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు జోఎల్ ప్రసాద్, జి.హర్షవర్ధన్‌రెడ్డి, డీపీఓ ఓన్నూరుసాహెబె, నూర్‌హెల్త్ ఆర్గనైజర్ వాత్సల్య పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై లైంగిక దాడి

కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

క్రోసూరు: మతిస్థిమితం లేని యువతిపై ఓ కానిస్టేబుల్ లైంగిక దాడికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ షఫీ శుక్రవారం తెలిపిన వివరాలు.. క్రోసూరు ఎస్సీ కాలనీకి చెందిన మతిస్థిమితిలేని యువతిని సత్తెనపల్లిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ ఎం.రవిబాబు మాయమాటలు చెప్పి ఊరు శివారుకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గతంలో ఆ కానిస్టేబుల క్రోసూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహించినట్లు చెప్పారు. ఇటీవల సత్తెనపల్లికి బదిలీ అయ్యాడు. అక్కడ డ్యూటీ ముగించుకుని క్రోసూరు వచ్చి మతి స్థితిమితం లేని యువతిని ద్విచక్రవాహనం ఎక్కించుకుని క్రోసూరు శివారు వేల్పూరు వైపు తీసుకెళ్లాడు. అక్కడ పాత రేకులషెడ్డు వద్దకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు యువతిని సత్తెనపల్లి వైద్యపరీక్షలకు పంపించటం జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు



జాతీయ స్థాయిలో విజయం సాధించిన ఆంధ్ర జట్టు

చినగంజాం: జాతీయ స్థాయిలో కబడ్డీ జట్టు విజయం సాధించడం గొప్ప విషయమని ప్రకాశం జిల్లా కబడ్డీ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా క్రీడాకారులను శుక్రవారం పలువురు అభినందించారు. ఆయన మాట్లాడుతూ బిహార్‌లో మార్చి 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన సబ్ జూనియర్ నేషనల్ కబడ్డీ టోర్నమెంట్ బిహార్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు బ్రాంజ్ మెడల్ సాధించింది. జట్టులో ప్రకాశం జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు భోగిరెడ్డి భవానిశంకర్‌రెడ్డి, ఆట్ల అశోక్‌రెడ్డి, ఆట్ల అభిలాష్‌రెడ్డి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో మెడల్ వచ్చేందుకు కృషి చేశారన్నారు. సుమారు 17 ఏళ్ల తరువాత ఆంధ్రప్రదేశ్‌కు సబ్ జూనియర్ మెడల్ రావడం సంతోషకరమన్నారు. క్రీడాకారులను అభినందించిన వారిలో కోచ్ చెరుకూరి పుల్లయ్య, సీనియర్ క్రీడాకారులు పీ రామచంద్రరావు, టీ పద్మారావు, ఎస్.శ్రీనివాసరెడ్డి, పీడీ అంకమ్మ, స్వామిరెడ్డి, రమణారెడ్డి, ఎం.కోటేశ్వరరావు, ప్రకాశం జిల్లా కబడ్డీ చైర్మన్ పీ భాస్కర్, ప్రెసిడెంట్ ఎస్.అర్జునరావు, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, ఆంధ్ర కబడ్డీ స్టేట్ ప్రెసిడెంట్ జీ వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు.

ఎన్నికల కోడ్ పట్టని జనసేన



బల్లికురవ: ఎన్నికల కోడ్ జనసేన ఉల్లంఘిస్తోంది. జెండాలను తొలగించటం లేదు. అంతేకాదు అధికారులు తొలగించినా తిరిగి ఏర్పాటు చేశారు. వివరాలు.. బల్లికురవ మండలం ముక్తేశ్వరం పంచాయతీలోని రామాంజనేయపురంలోని ప్రభుత్వ రక్షిత తాగునీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్‌పై జనసేన జెండాలను చాలా కాలం నుంచి ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే గ్రామ పంచాయతీ సెక్రటరీ షేక్ బాజీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ట్యాంకుపై జెండాలను తొలగించారు. తమజెండా తొలగిస్తారా అంటూ స్థానిక నేతలు తిరిగి జెండా ఏర్పాటు చేశారు. నార్కెట్‌పల్లి- మేదరమెట్ల నామ్ రహదారిలో ఉన్న రామాంజనేయపురంలో జెండా ఏర్పాటు చేయటంపై ఈ రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, చర్చించుకుంటున్నారు.

స్కూల్ బస్సు దగ్ధం

దుర్గి: మండల కేంద్రమైన దుర్గికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ప్రమాదవశాత్తూ మంటల్లో దగ్ధమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఒంటిపూట బడులు అయిన తర్వాత పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులను గ్రామాలకు చేరవేసే క్రమంలో దుర్గి నుంచి బయలుదేరిన స్కూల్ బస్సు కంచరగుంట గ్రామ పొలిమేరలో ఇంజన్ నుంచి చిన్నగా మంటలు రావడం గమనించిన డ్రైవర్ అప్రత్తమై బస్సు నిలిపివేశాడు. బస్సులో ఉన్న విద్యార్థులను కిందకు దింపి బస్సును వారి నుంచి దూరంగా తీసుకెళ్లాడు. పెద్దగా మంటలు చెలరేగుతూ నిమిషాలలోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సాతులూరులో పట్టపగలే చోరీ

- 457 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు చోరీ
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



సాతులూరులో దుండగులు పగలగొట్టిన బీరువా

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో భారీ చోరీ జరిగింది. పట్టపగలే ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 457 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు కలిపి సుమారు రూ.27 లక్షలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఆర్య వైశ్య వీధిలో నివాసం ఉండే మాజేటి ప్రవీణ్ విజయ్‌కుమార్ స్థానిక రైస్ మిల్లులో భాగస్వామి. ఆయన భార్య కవిత గ్రామలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తుంది. ఒంటిపూట బడులు కావటంతో ఉదయాన్నే ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లింది. ఆ తర్వాత కొద్దిసేపటికి ప్రవీణ్ కూడా రైస్‌మిల్లుకు వెళ్లాడు. వీరి కుమారుడు పార్థు గుంటూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటికి తాళాలు వేసిన పార్థు రైస్‌మిల్లుకు వెళ్లి తన తండ్రికి తాళాలు ఇచ్చి గుంటూరుకు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన కవిత, తలుపులు తెరచి ఉండటం చూసి లోనికి వెళ్లింది. ఇంట్లో బీరువా పగలగొట్టి ఉండటం గమనించి భర్త ప్రవీణ్ విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసింది. ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ జె బలరామ్ రెడ్డి సిబ్బందితో కలిసి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ చోరీలో సుమారు రూ.27 లక్షల విలువైన 457 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు ప్రవీణ్‌విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నాడు. చోరీకి పాల్పడిన దుండగులు బీరువాలోని బంగారు ఆభరణాలు మాత్రమే తీసుకుని వెండి వస్తువులను అక్కడే పడవేసి వెళ్లారు. క్లూస్ టీం, పల్నాడు జిల్లా క్రైం ఎస్సై లోకేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సాతులూరులో జరిగిన భారీ చోరీ ఘటనపై నరసరావుపేట డీఎస్పీ వర్మ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడు మాజేటి ప్రవీణ్‌విజయ్‌కుమార్ నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయనతో పాటు ట్రైనీ డీఎస్పీ జగదీష్, చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, నాదెండ్ల ఎస్సై జె బలరామ్‌రెడ్డి ఉన్నారు.

పారా లీగల్ వలంటీర్లు నియామకం

సత్తెనపల్లి: పారా లీగల్ వలంటీర్లుగా ఏడుగురిని నియమిస్తూ సత్తెనపల్లి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) డి.నాగవెంకటలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పారా లీగల్ వలంటీర్లుగా కొత్త బాబురావు, డి.మనోహర చిన్న, జక్కుల లక్ష్మీనారాయణ, షేక్ సుభాని, షేక్ ఖాజావలి, గుర్రాల షేక్ ముబారక్, కోడూరు విజయ గోపాల్‌లను నియమించారు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
శనివారం ॥ 23-3-2024





పిచ్చుకా క్షేమమా

ఐ లవ్ స్పారోస్!!

మనిషి తన సౌకర్యం కోసం ప్రకృతి సమతుల్యతకు విఘాతం కలిగిస్తూనే ఉంటాడు. ప్రకృతి సహనంతో ఓర్చుకుంటూ, అప్పుడప్పుడూ విలయం రూపంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉంటుంది. మొత్తంగా తనను తాను సమతుల్యం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. 'మాయమైపోతున్నదమ్మ మనిషన్నవాడు'... అని పిచ్చుకలు ఆవేదన చెందుతున్న సమయంలో ప్రకృతిఓ అమ్మాయి మనసును కదిలించింది. ఆమె ఇప్పుడు పక్షి ప్రేమికురాలైంది. తన ఇంటిని పక్షులకు విలాసంగా మార్చింది. తాను పక్షి ప్రేమికురాలిగా మారిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు మంచాల హరిణి.



హరిణి

అడవికి దాహం వేసింది!

''అప్పుడు నేను బీబీఏ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నాను. అమ్మా నాన్న, నేను, అక్క అందరం ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న మా పెద్ద నానమ్మ వాళ్ల ఊరికి వెళ్తున్నాం. నిర్మల్ దాటి కడెం మీదుగా అడవిలో ప్రయాణిస్తున్నాం. మే నెల కావడంతో ఎండ తీవ్రంగా ఉంది. చెట్ల మొదళ్ల ఎండిపోయి వానల కోసం ఎదురు చూస్తున్నాయి. ఓ పక్షి మా కళ్ల ముందే చెట్టుకొమ్మ మీద నుంచి జారి నేల మీద పడింది. కొద్ది సెకన్లపాటు రెక్కలు కొట్టుకున్నాయి. కారాపి వెళ్లి చూశాం, పక్షిని చేతుల్లోకి తీసుకుని మా దగ్గరున్న నీటిని చల్లి, తాగించడానికి ప్రయత్నించాం. కానీ ఆ పక్షి అప్పటికే ప్రాణాలు వదిలేసింది. ఆ చిన్న ప్రాణికి ఎన్ని నీళ్లు కావాలి, ఆ గుక్కెడు నీళ్లు లేకనే కదా ప్రాణం పోయిందని చాలా బాధేసింది. ఆ దృశ్యం పదే పదే కళ్ల ముందు మెదలసాగింది. ఇలాగ ఒక్కో వేసవికి ఎన్ని పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయో కదా... అనిపించింది. ఏదైనా చేయాలనిపించింది. కానీ ఏం చేయాలనేది వెంటనే స్ఫురించ లేదు.

పిచ్చుకలు వచ్చాయి!

పక్షులకు నీటికోసం ఇంటిముందు చిన్న పాత్రలో నీటిని పెట్టడం మొదలు పెట్టాను. పావురాలు ఇతర పక్షుల కంటే పిచ్చుకలే ఎక్కువగా రాసాగాయి. దాంతో పర్మినెంట్ సొల్యూషన్ కోసం ఆలోచిస్తున్నప్పుడు పిచ్చుకల సైజ్‌ని కూడా దృష్టిలో పెట్టుకుని ఫీడర్ బాక్స్ డిజైన్ చేశాను. ఇందుకోసం ఇంటర్‌నెట్‌లో చాలా సెర్చ్ చేశాను. మహారాష్ట్ర, నాసిక్‌లోని ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసే ఫ్యాక్టరీ వాళ్లతో మాట్లాడి నాక్కావలసిన డిజైన్‌ను వివరించాను. వాళ్లు రఫ్ తయారు చేసి వాట్సాప్‌లో పంపించేవారు.



'బర్డ్ ఫీడర్ బాక్స్' పంపిణీ చేస్తున్న హరిణి (కుడివైపు)

ప్లాస్టిక్ డబ్బాకు కిటికీల్లాగ ఓపెన్‌గా ఉంచి చిన్న ప్లాస్టిక్ రాడ్‌ను పెట్టించాను. పక్షి ఆ రాడ్ మీద నిలబడి, తెరిచి ఉన్న కిటికీలో ముక్కు పెట్టి గింజలను తింటుంది. నీటి కోసం డబ్బా కింద సాసర్ పెట్టించాను. నాకు సంతృప్తి కలిగే వరకు డిజైన్‌ను మారుస్తూ చేసిచ్చారు వాళ్లు. ఐదేళ్ల కిందట ఇదే తొలి డిజైన్. మొదట వంద పీస్‌లు చేయించి బంధువులు, స్నేహితులకిచ్చాను. తర్వాత అందరూ అడుగుతుండడంతో పెద్ద మొత్తంలో చేయిస్తున్నాం. తాతయ్య పేరుతో 'మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్' ద్వారా అందరికీ పంచుతున్నాం. ఒక మంచి పని చేయడం, అది కూడా మా తాతయ్య పేరుతో చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికి రెండువేలకు పైగా ఇలాంటి డబ్బాలను పంచాను. ఇప్పుడు నేను యూఎస్‌లో పీజీ చేస్తున్నాను. నేను మొదలు పెట్టిన పనిని మా నాన్న కొనసాగిస్తున్నారు. మా చేతిమీదుగా ఈ బర్డ్ ఫీడర్ బాక్స్‌లు అటు ఆదిలాబాద్, నాందేడ్ వరకు, ఇటు హైదరాబాద్, సూర్యాపేట, గుంటూరుకు కూడా చేరాయి. ఈ బాక్స్ కావాలని ఎవరడిగినా వాళ్ల అడ్రస్ పంపిస్తే చాలు కొరియర్ చార్జ్‌లు కూడా మేమే భరించి ఉచితంగా పంపిస్తాం. వంద మాటలు చెప్పడం కంటే ఒక మంచి పని చేయడం మేలని నమ్ముతాను. ఐదేళ్ల నుంచి ఈ పని చేస్తున్నప్పటికీ నేను ఎక్కడా ప్రచారం చేసుకోలేదు. ఐ లవ్ స్పారోస్ అనేది ఈ ఏడాది వరల్డ్ స్పారో డే (మార్చి 20)సందర్భంగా ప్రపంచం ఇచ్చిన పిలుపు. కానీ నేను పిచ్చుకలను ప్రేమించడం ఎప్పుడో మొదలైంది. నేను అందరినీ కోరుకునేది ఒక్కటే. ఆ చిన్న ప్రాణుల కోసం రోజూ ఓ లీటరు నీటిని పెడదాం'' అన్నారు మంచాల హరిణి.

– వాకా మంజులారెడ్డి

చుక్క నీరుంటే చాలు!

గుప్పెట్లో పట్టుకుంటే నిండా గుప్పెడంత కూడా ఉండదు. పిచ్చుకంత ప్రాణం. రేడియేషన్ బారిన పడి అల్లాడిపోతోంది. అభివృద్ధి పేరుతో మనిషి చేసే అరాచకానికి భయపడిపోతోంది. మనిషి కంటపడకుండా పారిపోతోంది. ఏకంగా ఈ భూమ్మీద నుంచే మాయమైపోదామనుకుంటోంది. మనసున్న మనిషి కరవైన నేల మీద తనకు మనుగడ లేదని ఊరు వదిలి పారిపోయింది. అడవుల బాట పట్టి ఏ చెట్టుకొమ్మనో తనను తాను దాచుకుంటూ నీటిచుక్క కోసం వెతుక్కుంటోంది. మనిషి మనసులో ఆర్ద్రత, గుండెలో తడి ఉందని తెలిసిన పిచ్చుక మళ్లీ రెక్కలు టపటపలాడిస్తోంది. వందలాది బంధుగణంతో నిజామాబాద్‌లో మంచాల హరిణి ఇంటి ముందు కొలువుదీరింది. ఈ మాత్రం ఆలంబన దొరికితే చాలు... కిచకిచలతో ఊరంతటికీ వీనులవిందు చేస్తానంటోంది పిచ్చుక.

చిరుతలు

ధైర్యంగా ఉండమని చెప్పడం అందరూ చేసే పనే.
ధైర్యాన్ని ప్రదర్శించడం కొందరు చేసేది.
ప్రమాదంలోనూ ధైర్యాన్ని చూపడం అతి కొద్ది మందే చేస్తారు.
ఆ అతి కొద్దిమందిలోనూ మేటిగా నిలుస్తున్నారు
హైదరాబాద్‌లోని బేగంపేట వాసులైన ఈ తల్లీ కూతుళ్లు.
ఇంట్లోకి అకస్మాత్తుగా చొరబడిన ఆగంతకులపైకి
చిరుతపులుల్లా విరుచుకుపడ్డారు.
మారణాయుధాలతో బెదిరించినా ఆత్మస్థైర్యాన్ని బెదరనివ్వలేదు.
ఇద్దరు దుండగులను తరిమి తరిమి కొట్టిన తల్లి అమిత మెహోత్.
తల్లిని కాపాడుకునేందుకు దుండగులతో వీరోచితంగా పోరాడిన కూతురు బాబీ.



బాబీ



అమిత, బాబీలను సత్కరిస్తున్న డీసీపీ రోహిణీ ప్రియదర్శిని

దుండగులు ఎలా ఎప్పుడు ఎక్కడ నుంచి వస్తారో, ఎలా దాడి చేస్తారో మనం ఊహించలేం. అకస్మాత్తుగా ఎదురయ్యే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో తెలియక ధనాన్నే కాదు ప్రాణాలను సైతం కోల్పోయేవారెందరో. కానీ, ప్రాణాలను కూడా లెక్క చేయకుండా దుండగుల దుశ్చర్యను క్షణమాత్రంలోనే గుర్తించి, ఆ వెంటనే తమ స్థైర్యాన్ని చూపి నేడు ఎంతో మంది ప్రశంసలు అందుకుంటున్నారు అమిత, బాబీ. స్త్రీలు సబలలు అని నిరూపించిన ఈ వనితలు నేడు ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తున్నారు.

''ఎప్పుడో ప్రాక్టీస్ చేసిన బాక్సింగ్‌తో పాటు 15 ఏళ్లుగా చేస్తున్న జిమ్ వ్యాయామాలు, వీటికి తోడు మార్షల్ ఆర్ట్స్‌పై అవగాహన.. ఇవన్నీ దుండగులు తుపాకీ గురి పెట్టినా ఏమాత్రం బెదరక ధైర్యంగా నిలబడేలా చేశాయి. దోచుకోవడానికి వచ్చిన వారిని తరిమి కొట్టేలా చేశాయి'' అని తెలిపింది సలభై ఆరేళ్ల అమిత. ఊహించని విధంగా ఆ తల్లీకూతుళ్ల నుంచి ప్రతిఘటన ఎదురవడంతో దుండగులు కాళ్లకు బుద్ధి చెప్పాల్సి వచ్చింది.

కొరియర్ బాయ్స్ వేషంలో..

ఆన్‌లైన్ అమ్మకాలు పెరిగాక కొరియర్ బాయ్స్ మన ఇళ్ల ముందుకు వస్తుంటారు. వారి గురించి మనకేవిధంగానూ తెలియదు. అలాగని, కొరియర్ వారంతా ప్రమాదకారులే అని మనం చెప్పలేం. కానీ, ఒక్కోసారి సమస్య ఈ విధంగానూ మనల్ని పలకరించవచ్చు అని గ్రహించాలి అనడానికి గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన మన కళ్లకు కడుతుంది. ''మా ఇంటి గుమ్మానికి, ప్రధాన గేటుకు 200 ఫీట్ల దూరం ఉంటుంది. కొరియర్‌బాయ్స్ ఎవరొచ్చినా గేటు బయటనే ఉండి పిలుస్తారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బ్యాగ్‌తో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకరు హెల్మెట్ ధరించి ఉండగా మరొకరు మాస్క్ ధరించి ఉన్నారు. నేను మొదటి అంతస్తులోనే ఉండి కొరియర్ వివరాలు అడిగాను. అమిత (నా పేరు), ఎన్‌కె జైన్ (నా భర్త) పేర్లు చెప్పి కొరియర్ వచ్చిందని చెప్పారు. అక్కడే ఉండాలని, వచ్చి తీసుకుంటామని చెప్పాను. నేను కిందికి వచ్చేసరికి గేటు లోపలి నుంచి గుమ్మం వద్దకు వచ్చేశారు.

ఎదుర్కొని .. కనిపెట్టి..

బ్యాగ్‌లో నుంచి కొరియర్ పార్శిల్ తీస్తున్నట్లుగా తీసి ఒకరు తపంచా (నాటు తుపాకీ)తో నాపై ఎక్కుపెట్టాడు. మరొకరు నన్ను తోసుకుంటూ లోపలికి వచ్చి కిచెన్‌లో ఉన్న పనిమనిషి మెడపై కత్తి పెట్టాడు. నా అరుపులకు మొదటి అంతస్తులో ఉన్న కుమార్తె కూడా వచ్చింది. మాపై అటాక్ చేస్తుండగా మేం కూడా తిరిగి అటాక్ చేశాం. ఇద్దరం కలిసి ఆ వ్యక్తి చేతులను గట్టిగా పట్టుకుని వెనక్కి తిప్పి, తపంచాను లాగేసుకున్నాం. దీంతో అచేతనుడైన ఆ వ్యక్తి వెంట తెచ్చుకున్న తాళ్లతో మమ్మల్ని కట్టేసేందుకు ప్రయత్నించగా, ఎదురుతిరిగాం. దాదాపు 20 నిమిషాల సేపు ఘర్షణ జరిగింది. చివరకు ఆ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడు. మమ్మల్ని బలవంతంగా తోసుకుంటూ బయటకు వచ్చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు మేము ఎంతగానో వెంబడించాం. ఆ వ్యక్తి పారిపోయాడని తెలుసుకుని కిచెన్‌లో ఉన్న మరో వ్యక్తి ఎక్కడ దొరికిపోతాడో అని ఆందోళనపడ్డాం. అతను కూడా పారిపోయేందుకు కత్తితో బెదిరిస్తూ బయటకు వచ్చాడు. మా అరుపులకు ఈ లోగా స్థానికులు రావడంతో అతన్ని పట్టుకోగలిగాం. తెలిసిన వారే అయ్యుంటారని మేం వారు ధరించిన హెల్మెట్, మాస్క్‌ను తీసేయడంతో వారెవరో కనిపెట్టగలిగాం. కిందటేడాది దీపావళి సమయంలో పది రోజులపాటు మా ఇంటి క్లీనింగ్ విషయంలో ఓ ఏజెన్సీని సంప్రదిస్తే, వారు పంపించిన వ్యక్తులే వీళ్లు. మా ఇంటిని క్లీన్ చేసే సమయంలో ఏయే వస్తువులు ఎక్కడ ఉన్నాయో గమనించి, ఇంట్లో ఆడవాళ్లం మాత్రమే ఉండే సమయం చూసి, ఇలా దొంగతనం చేయడానికి ప్లాన్ చేసుకున్నారని తెలిసింది. మేం ఎదురు తిరగడంతో వచ్చిన పని గురించి కాకుండా మేము తమ ముఖాలను చూడకుండా కాపాడుకునేందుకే ఎక్కువ ప్రయత్నం చేశారు.

ఆత్మరక్షణకై మెలకువలు అవసరం

మహిళలు ఆత్మరక్షణ దిశగా మెలకువలను నేర్చుకోవాలి. ఇప్పుడు నా జీవితంలో ఎదురైన అనుభవం లాగా ఎవరి జీవితాల్లోనూ రాకూడదని కోరుకుంటాను. ఒక వేళ వస్తే మాత్రం అందుకు సిద్ధంగా ఉండాలి. ధైర్యంగా ముందడుగు వేయాలి.

– అమిత



ఆ ధైర్యం ఎలా వచ్చిందంటే..

గతంలో ఐదేళ్లు బాక్సింగ్ ప్రాక్టీస్ చేశాను. రోజూ జిమ్‌కు వెళ్తుంటాను. మార్షల్ ఆర్ట్స్‌పై కూడా అవగాహన ఉంది. అవే నన్ను ధైర్యంగా ఉండేలా, సాహసం చూపేలా చేశాయి. ఎదురొచ్చిన విపత్తు నుంచి కాపాడేలా చేశాయి. ఒక తపంచా, రెండు కత్తులు, తాళ్ల సహాయంతో వారు మమ్మల్ని లొంగదీసుకునేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. వారి ప్రతి చర్యను తిప్పికొట్టగలిగామంటే బాక్సింగ్, ఫిట్‌నెస్‌లే కారణమని కచ్చితంగా చెప్పగలను'' అని తామ ఎదుర్కొన్న సంఘటనను వివరించారు అమిత.

ఈ తల్లీకూతుళ్లు దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ఈ ఘటన తర్వాత అమిత, ఆమె భర్త, స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

డీసీపీ ప్రశంసలు.. సన్మానం..

అమిత, ఆమె కుమార్తె బాబీ ఇద్దరూ చూపిన ధైర్యసాహసాలు ఆదర్శప్రాయం అని నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. బేగంపేట పైగా కాలనీలోని అమిత నివాసానికి నేరుగా వచ్చిన డీసీపీ అమితతో పాటు ఆమె కుమార్తెనూ ప్రశంసించి, శాలువాతో సత్కరించారు. మైనర్ బాలిక అయినా ఆమె చూపిన తెగువ ఎంతో అభినందనీయమన్నారు.

– కోట కృష్ణారావు, సాక్షి, హైదరాబాద్

బ్యూటిప్స్

పార్లర్‌తో పని లేదు...

పార్లర్‌లో ఫేషియల్‌తో పనిలేకుండా, ఖరీదైన క్రీములు కొనకుండా ముఖం చక్కగా మెరవాలంటే ఇంట్లోనే టొమాటో ఫేషియల్‌ను ప్రయత్నించండి. పెళ్లికూతురులా మెరిసిపోతారు.





- టొమాటోను గుండ్రని ముక్కలుగా కోయాలి. ఒక ముక్కను తీసుకుని పైన టీస్పూను పంచదార, టీస్పూను కాఫీ పొడి వేసి ముఖంపైన అద్దాలి. తరువాత చేతులతో సున్నితంగా మర్దన చేసి కడిగేయాలి.
- ఇప్పుడు మరో టొమాటో ముక్కపై టీస్పూను అలోవెరా జెల్ వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి. ఈ మర్దన అయిన వెంటనే మరో టొమాటో ముక్కపై రెండు టీస్పూన్ల పసుపు వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి.
- పసుపు పూర్తిగా ఆరాక నీటితో కడిగేసి, తడి లేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ టొమాటో ఫేషియల్‌లోని ప్రతి స్టెప్‌ను జాగ్రత్తగా అనుసరిస్తే ముఖం కాంతిమంతంగా మెరిసిపోతుంది.
- అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరినూనె వేసి కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌గా పనిచేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.

ఇంటిప్స్

సీలింగ్ ఫ్యాన్ ఇలా శుభ్రం

సాధారణంగా సీలింగ్ ఫ్యాన్‌లను ఎక్కువ ఎత్తులో అమరుస్తారు. అందువల్ల వాటిని తరచు శుభ్రం చేయడం చాలా కష్టం. అలాగని నెలల తరబడి అలాగే ఉంచేస్తే మురికి పేరుకుని పోయి అసహ్యంగా కనిపిస్తుంది. అటువంటి పరిస్థితుల్లో పాత పిల్లో కవర్ తీసుకుని టేబుల్ మీద ఎక్కి సీలింగ్ ఫ్యాన్ రెక్కలను కవర్ చేయాలి. కవర్ పైభాగం నుంచి మీ చేతులతో రుద్దాలి. అదేవిధంగా, మూడు రెక్కలను శుభ్రం చేయాలి. మట్టి కూడా కవర్‌లో పడిపోతుంది. ఇది మీ ఇంటిని కూడా మురికిగా చేయదు.

మరో పద్ధతి...

పాత షర్ట్, టీషర్ట్ లేదా ఏదైనా కాటన్ వస్త్రం సహాయంతో ఫ్యాన్‌ను శుభ్రం చేయవచ్చు. ఫ్యాన్ మీద పొడి దుమ్ము ఉంటే.. అది సులభంగా ఒక వస్త్రంతో శుభ్రం చేసుకోవచ్చు. ఒకవేళ వంటగదిలో ఉండే ఫ్యాన్‌ను క్లీన్ చేస్తున్నట్లయితే.. దానిపై నూనె, ధూళి పేరుకుపోయి ఉంటుంది. అటువంటి వాటిని సబ్బుతో కడగడం మంచిది. కాసేపు రెక్కలను స్క్రబ్ చేయాలి.



గుర్తుంచుకోవాల్సింది..

ఫ్యాన్‌ను క్లీన్ చేసినప్పుడల్లా కింద ఒక షీట్ లేదా వస్త్రాన్ని పరచాలి. దీంతో ఫ్యాన్ క్లీన్ అయిన తర్వాత మీకు పని పెరగదు. ఫ్యాన్ మురికి షీట్లో పడిపోతుంది.

ఫ్యాన్ శుభ్రం చేసేటప్పుడు గ్లాసెస్ లేదా సన్‌గ్లాసెస్ ధరించండి. ఇది చెత్తను కంట్లో పడకుండా చేస్తుంది. దీంతో అలర్జీ కూడా రాదు. సీలింగ్ ఫ్యాన్ శుభ్రం చేసేటపుడు ముక్కుకు మాస్క్ లేదా రుమాలు కట్టుకోవాలి.

హోలీ

రంగు పడే ఊళ్లు

తీర్థయాత్రలు చేస్తారు కొందరు. వర్షయాత్రలు కొందరికి ఇష్టం. మన దేశంలో హోలి చాలా హుషారైన పండగ. బహుశా దీపావళి తర్వాత చిన్నా పెద్దా అందరూ కేరింతలతో పాల్గొనే పండగ ఇదే. రొటీన్ జీవితంలో రంగులను నింపుకోవడం బాగుంటుంది. అయితే కొందరికి ఇంట్లోనో, అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోనో, వీధిలో, ఏరియా చౌరస్తాలోనో ఆడే హోలీ పెద్దగా ఆనదు. వారికి భారీ హోలి వేడుక చూడాలనిపిస్తుంది. అలాంటి వారి కోసం హోలి డెస్టినేషన్స్ ఉన్నాయి. మన దేశంలో. ఈ హోలీకి వెళ్లగలిగితే వెళ్లండి.

మథుర:

ఉత్తరప్రదేశ్‌లోని మథురలో హోలి వేడుకలు చూడటం అంటే కృష్ణ రాధలు ఆడే హోలిని చూసినట్టే. ఇక్కడి బర్సానాలో స్త్రీలు గోపికల్లా, పురుషులు గోపబాలురలా అలంకరించుకుని హోలి ఆడతారు. రంగులు చల్లడానికి వచ్చిన గోపబాలురను స్త్రీలు సరదాగా బడితెలతో బాది దూరం తరుముతారు. అందుకే దీనిని 'లాత్‌మార్ హోలి' అంటారు.






బృందావన్:

ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌కు వెళితే అక్కడి బన్‌కె బిహారి ఆలయంలో పూలు, రంగులు కలిపి చల్లుకుంటూ కోలాహలంగా హోలి నిర్వహిస్తారు. అందుకే దీనిని 'ఫూల్‌వాలోంకి హోలి' అంటారు. ఇక్కడ ఒకరోజు రెండు రోజులు కాదు... వారం రోజులపాటు హోలి వేడుకలు జరుగుతునే ఉంటాయి. చుట్టుపక్కల పల్లెలు రంగులతో తెల్లారి రంగులతో అస్తమిస్తాయి. ఈ అద్భుతమైన వేడుకలను చూడానికి టూరిస్టులు వస్తారు.

ఉదయ్‌పూర్:

ఇక రాచరికస్థాయిలో హోలి చూడాలంటే రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు వెళ్లాలి. అక్కడి సిటీ ప్యాలెస్‌లో రాజ వంశీకుల హాజరీలో అద్భుతమైన హోలి వేడుకలు జరుగుతాయి. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాజస్థానీ జానపద కళల ప్రదర్శన ఉంటుంది. టూరిస్టులు ఈ వేడుకలు చూడటానికి తెగబడతారు.



హంపి:

తుంగభద్ర నది ఒడ్డున రంగుల పండగ ఎలా ఉంటుందో చూడాలంటే హంపి వెళ్లాలి. ఇక్కడ హంపి సందర్భంగా భారీగా అలంకరించి నిర్వహించే రథయాత్ర చూడటానికి రెండు కళ్లూ చాలవు. ఈ సాంస్కృతిక క్షేత్రంలో హోలీ ఒక విచిత్ర భావన కలిగిస్తుంది. నగర ప్రజలు డోళ్లు మోగిస్తూ హోలి వేడుకల్లో విశేషంగా పాల్గొంటారు. విరూపాక్ష ఆలయం ఈ సందర్భంగా కళకళలాడిపోతుంది. దక్షిణాదివారు హోలీ సెలవు హంపిలో గడిపి ఆనందించవచ్చు.



శాంతినికేతన్:

పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్‌లో హోలి అయితే నయనానందమూ శ్రవణానందమూ కూడా. ఎందుకంటే అక్కడ హోలి అంటే రంగులు చల్లుకోవడం మాత్రమే కాదు... నృత్యాలు, సంగీతం, కవిత్వం... అమ్మాయిలు అబ్బాయిలు కలిసి మనోహరంగా హోలి జరుపుకుంటారు. రవీంద్రనాథ్ ఠాగూర్ మొదలెట్టిన ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. ఇక్కడకు వెళ్లి హోలి చూసినవారి హృదయం కచ్చితంగా రంగులతో నిండిపోతుంది.



ఆనంద్‌పూర్ సాహిబ్:

పంజాబ్‌లోని ఈ ఊళ్లో హోలీ రంగులకు కళ్లు చెదురుతాయి. నిహాంగ్ సిక్కులు ఇక్కడ హోలి సమయంలో యుద్ధ విద్యలు ప్రదర్శిస్తారు. ఉత్తుత్తి పోరాటాలు ఇరు జట్ల మధ్య జరుగుతాయి. డోళ్లు తెగ మోగుతాయి. ఆట పాటల అట్టహాసం చూడతగ్గది.

